


యోగా చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తదితరులు



యోగాతో ఆరోగ్య భాగ్యం

- యోగా దినచర్యలో భాగం కావాలి
- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్
- గండికోటలో యోగా కార్యక్రమం
- దాదాపు 6 వేల మంది హాజరు



గండికోట పెన్నాలోయ వద్ద యోగా చేస్తున్న విద్యార్థులు



గండికోట లోయ పక్కన యోగాసనాలు వేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగాతో సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్య భాగ్యం సిద్ధిస్తుందని, దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రజలకు పిలుపునిచ్చారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గండికోటలోని లోయ పక్కన పర్యాటక యోగా థీమ్‌తో దాదాపు ఆరువేల మందితో యోగా గురువులు యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ కలెక్టర్ మాట్లాడుతూ.. మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతలకు యోగా మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. రకరకాల వత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటన్నింటి జయించి సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలంటే రోజుకు 30 నుంచి 40 నిమిషా లు యోగా, ధ్యానం కోసం కేటాయించాలని కోరారు. ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటికే జిల్లా నుంచి మండలస్థాయి వరకు దాదాపు 6 వేల మంది యోగా ట్రైనర్లతో దాదాపు 5.70 లక్షల మందికి యోగా శిక్షణ ఇచ్చామన్నారు. ఈ యోగా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు తమ స్వీయ బాధ్యతగా స్వీకరించాలని చివరి మూడు రోజులు ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ కోరారు. విశాఖలో ఈనెల 21వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరవుతున్నారని.. ఆ రోజున జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో జిల్లాలోని ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని కోరారు.

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ యోగాసనాలు వేయడం ద్వారా క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, మెరుగైన జీవన విధానం అలవడుతాయన్నారు. పర్యాటక మ్యాపులో ఇప్పటికే ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించిన గండికోట పర్యాటకంగా మరిన్ని అభివృద్ధి పనులతో ప్రపంచ ప్రఖ్యాతి పొందుతోందన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, అధికారులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యోగాసనాలు వేసిన అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై ఈగల్ టీం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్, ఎమ్మెల్యే, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించి మాదక ద్రవ్యాలను నిరోధిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నాగరాజు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గోనా పురుషోత్తంరెడ్డి, వంగల నాగేంద్రయాదవ్, జంబాపురం రమణారెడ్డి, బీసీ నాయకులు కొండయ్య, సర్పంచులు గురుశేఖర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, ఈశ్వర్, పెద్ద ఎత్తున మహిళలు, పలు కళాశాలల, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



యోగాసనాలు వేసేందుకు వస్తున్న విద్యార్థులు



మాదక ద్రవ్యాలను నిరోధిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



యోగాంధ్ర సందర్భంగా గండికోటలో ఆకట్టుకున్న ప్రొద్దుటూరు విద్యార్థినుల నృత్యం

సేంద్రియ వ్యవసాయాన్ని పెంచాలి

- ప్రభుత్వ విప్ ఆర్.మాధవి



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆర్.మాధవి, జేసీ అదితిసింగ్, తదితరులు

కడప రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకొని తద్వారా సేంద్రియ వ్యవసాయాన్ని రైతులు పెంచాలని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన రైతులకు సబ్సిడీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల ఆకాంక్షల మేరకు సబ్సిడీ పథకాలను రూపొందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు చేపడుతోందన్నారు. పంట ఉత్పత్తులు వృధా ఆకాకుండా రైతులకు మద్దతు ఇచ్చేందుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. అందులో భాగంగా రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ యంత్రపరికరాలకు మంజూరైన సబ్సిడీకి సంబంధించిన రూ.2,04,96,310 మెగా చెక్కును రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయండి

- కమిషనర్‌ను కోరిన కొనిరెడ్డి



కమిషనర్ క్రిష్ణతేజకు వినతిపత్రం ఇస్తున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న 15వ ఫైనాన్స్ నిధులను విడుదల చేసి సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజను జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం రాష్ట్ర సర్పంచుల సంఘ అధ్యక్షుడు చిలకలపూడి పాపారావుతో కలిసి కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 15వ ఫైనాన్స్ నిధులు విడుదల కాకపోవడంతో గ్రామీణాభివృద్ధి కుంటుపడుతోందని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే నిధులను విడుదల చేయాలని కోరామన్నారు. అలాగే ఉపాధి హామీ నిధులను కూడా విడుదల చేయాలన్నారు. సర్పంచుల గౌరవవేతనం రూ.10 వేలకు పెంచాలని, ప్లాన్ అప్రూవల్ అధికారం కూడా తిరిగి పంచాయతీలకు అప్పగించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

- ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సూచనలిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్

సింహాద్రిపురం / పులివెందుల రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం సింహాద్రిపురం మండలంలోని బలపనూరు, కోవరంగుట్టపల్లి, లోమడ, అంకాళమ్మగూడూరు.. తొండూరు మండలంలోని మల్లేల, తొండూరు గ్రామాలలో ఆయన పర్యటించి ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీ తోటల్లో నవధాన్యాలు విత్తితే భూ తాపం తగ్గి భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. చీనీ చెట్లు చీడపీడల బారిన పడకుండా ద్రవ జీవామృతం పిచికారి చేసుకోవాలన్నారు. కలుపు నివారణకు లైవ్ మల్చింగ్ విధానం పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ నరసింహారెడ్డి, యూనిట్ మాస్టర్ ట్రైనర్ నాగసుబ్బరాయుడు, మోడల్ మేకర్ ఐవీ రమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేమి ఆదర్శం..?



ఆదర్శకాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర గురించి ఓ వైపు సీఎం చంద్రబాబు నాయుడు పదేపదే చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో అధికారులకు సిబ్బందికి పట్టినట్టు లేదు. ప్రొద్దుటూరు పట్టణంలోని మోడంపల్లె బైపాస్‌రోడ్డులో ఉన్న ఆదర్శ కాలనీలో నరసింహస్వామి గుడి వద్ద మురుగునీరు రోడ్డుపై చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సరైన కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే నిలుస్తోంది. దీంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండటం వలన దోమలు, దుర్వాసనతో అప్పుడప్పుడు రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలు ఏర్పాటుచేసి రోడ్డుపై మురుగునీరు లేకుండా చేయాలని ఆదర్శకాలనీ ప్రజలు కోరుతున్నారు.



భారీ ఎత్తున తవ్వకాలు జరిపిన దృశ్యం



టిప్పర్లకు ట్రాక్టర్ అడ్డుపెట్టి దౌర్జన్యం



ట్రాక్టర్ అడ్డుపెట్టడంతో రోడ్డుపై నిలబడిపోయిన టిప్పర్లు

కప్పం కట్టాల్సిందే..!

- ఎమ్మెల్యే అనుచరుడి దందా
- గ్రావెల్ టిప్పర్ల నిలిపివేత
- గంటల తరబడి రోడ్డుపై మెగా కంపెనీ టిప్పర్లు



ఫొటో తీస్తుంటే ముఖానికి దుప్పటి కప్పుకున్న ఎమ్మెల్యే అనుచరుడు

ప్రొద్దుటూరు/దువ్వూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సాగిన మట్టి, ఇసుక దోపిడీ కూటమి సర్కార్‌లోనూ యథేచ్ఛగా సాగుతోంది. నాడు అనుమతులు లేకుండా కొండలు, గుట్టలు ప్రభుత్వ భూముల్లోని మట్టి, గ్రావెల్‌ను అడ్డంగా తవ్వుకుని అక్రమంగా తోలుకున్నారు. నేడు కూటమి సర్కార్‌లో అనుమతులు తీసుకోవడం గోరంత.. తవ్వకాలు సాగించేది కొండంత అనే చందంగా సాగుతున్నాయి. నాడు వైసీపీ ఎమ్మెల్యేలు వారి అనుచరులు సాగించిన రీతిలోనే.. నేడు అధికార పార్టీవారు మామూళ్ల దందా సాగిస్తున్నారు. వారి మాట వినకున్నా, కప్పం కట్టకున్నా ఏకంగా పనులను అడ్డుకుంటున్నారు. కంపెనీలకు చెందిన టిప్పర్లకు ట్రాక్టర్లను అడ్డుపెట్టి దౌర్జన్యంగా నిలబెట్టేస్తున్నారు. సీఎం చంద్ర బాబు ఒకవైపు టీడీపీ ఎమ్మెల్యేల పనితీరుపై ఐవీఆర్ఎస్‌తో సర్వే చేస్తున్నా.. ఇవేమీ పట్టకుండా అనుచరగణం దందా సాగిస్తున్నారు.

మైదుకూరులో హైవేరోడ్డు నిర్మాణ పనులను మెగా ఇంజనీరింగ్ సంస్థ చేస్తోంది. దీనికి సంబంధించి దువ్వూరు మండలంలోని చిన్నశింగనపల్లె, దువ్వూరు గ్రామపొలాల్లో సర్వేనెంబరు 139, 142లలోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిలో లక్ష క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు తీసుకుంది. అయితే ఈ భూముల్లో అంతకు రెండింతలు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతూ రోజు వందలాది ట్రిప్పులు హైవే రోడ్డు నిర్మాణానికి తరలిస్తున్నారు. దీనిని అదనుగా చూసుకుని టీడీపీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు బుధవారం ఏకంగా గ్రావెల్ టిప్పర్లకు ట్రాక్టర్ అడ్డుపెట్టాడు. కప్పం కట్టాల్సిందే నని కాంట్రాక్టర్‌కు హుకుం జారీ చేశాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు దాదాపు 20కి పైగా టిప్పర్లను రోడ్లపై నిలిపివేశాడు. దీంతో కాంట్రాక్టర్ సదరు టీడీపీ నాయకుడి బేరానికి అంగీకరించడంతో వాటిని వదిలేశారు.

నిద్రపోతున్న అధికార యంత్రాంగం

ప్రభుత్వ భూములలో 25 అడుగులకు పైగా లోతు వరకు గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. మైనింగ్ అండ్ జియాలజీ వారు ఇచ్చిన అనుమతులు ఎంత.. వారు తవ్వుతున్న లోతు ఎంత అనే దానిపై విజిలెన్సు విచారణ జరిగితే ఇందులో ఎంత పెద్ద ఎత్తున అవినీతి జరిగిందో స్పష్టమవుతుంది.

ఐదు ఎకరాలకే అనుమతి

మైదుకూరు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న హైవే రోడ్డు నిర్మాణ పనుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు దువ్వూరు, చిన్నశింగన పల్లె పొలాల్లోని సర్వేనెంబరు 139, 142 లలో ఐదు ఎకరాల మేర ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తవ్వకాల కోసం అనుమతులు ఇచ్చాం. ఈ భూముల్లో లక్ష క్యూబిక్ మీటర్లు మాత్రమే గ్రావెల్ తవ్వకాలు జరపాలి. ఇచ్చిన అనుమతుల కంటే ఎక్కువగా తవ్వి ఉంటే ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం.

- సంజీవ రెడ్డి, తహశీల్దారు, దువ్వూరు

నలుగురు జీవిత ఖైదీలు విడుదల



జైలు నుంచి విడుదలైన ఖైదీలు

కడప క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న నలుగురిని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 17 మందిని విడుదల చేశారు. అందులో నలుగురు కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ఉన్నారు. సయ్యద్ రఫూఫ్ అలియాస్ రాజు (మదనపల్లె), హరిత విజయకుమార్ (కర్నూలు), పాయిని అలియాస్ పలాని(చిత్తూరు), బల్ల వసంతకుమార్ అలియాస్ వసంత (కడప)ను అధికారులు జైలు నుంచి విడుదల చేశారు.

అలాగే.. అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులో హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న తొండూరు మండలం గొట్లూరు గ్రామానికి చెందిన దొంతిరెడ్డి పౌల్ రెడ్డి, కడప అర్బన్‌కు చెందిన షేక్ బాబా ఫకృద్దీన్ సైతం బుధవారం విడుదలయ్యారు.

వైసీపీ నాయకుల బరితెగింపు



ప్రభుత్వ పాఠశాలలో పుట్టినరోజు వేడుకలునిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో అర్ధరాత్రి వైసీ పీ నాయకులు పుట్టినరోజు వేడుకల పేరుతో వీరంగం సృష్టించిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం రాత్రి నాగిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ఆవరణంలో వైసీపీ నాయకుడు షేక్ ఖలీంఖాన్ జన్మదిన వేడుకలను వైసీపీ యువ నాయకులు అర్ధరాత్రి జరుపు కున్నారు. బైక్‌పై కేక్ పెట్టి కట్ చేయడంతో పాటు ఈలలు, కేరింతలు కొడుతూ బాణాసంచా కాల్చుతూ నానా హంగామా చేశారని స్థానికులు తెలిపారు. ఒక పార్టీకి చెందిన నాయకుడి జన్మదిన వేడుకలు పాఠశాలలో జరపడమేమిటని చుట్టుపక్కల ఉన్న ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘాట్‌లో అదుపు తప్పిన బస్సు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన బస్సు

సీకేదిన్నె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న జగన్ ట్రావెల్స్ బస్సుకు గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. బుధవారం రాత్రి రాయచోటి నుంచి ప్రయాణికులతో బయలుదేరిన జగన్ ట్రావెల్స్ బస్సుకు గువ్వలచెరువు ఘాట్‌లో బ్రేక్ ఫెయిల్ అయింది. దీంతో బస్సును అదుపు చేయలేక కారును ఢీ కొంది. కానీ డ్రైవర్ చాకచక్యంగా బస్సును దాదాపు 5 అడుగుల గుడిపైకి ఎక్కించడంతో లోయలో పడే ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవ్వరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

దేశీ వంగడాల అభివృద్ధికి కృషి

- అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో పరిశోధనలు ● దేశీ వంగడాలపై విస్తృతంగా సర్వే
- రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో వంగ రకాల సేకరణ ● ప్రజాదరణ పొందిన రకాల గుర్తింపు

రైల్వేకోడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పీహెచ్‌డీ విద్యార్థులు, శాస్త్రవేత్తలు రాష్ట్రంలోని యాగంటిపల్లె, చిమ్మిడిపాళెం, మదనపల్లె, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో వంకాయ రకాలపై విస్తృతంగా సర్వే చేశారు. పోలూరు లోకల్, శ్రీకాళహస్తి లోకల్, రాయదుర్గం లోకల్ వంటి ప్రజాదరణ పొందిన రకాలను గుర్తించారు. ఈ రకాల వంకాయలు ప్రాం తీయంగా చాలా కాలంగా సాగులో ఉన్నవి మాత్ర మే కాకుండా, తేలిక పాటి రుచి, మంచి వాసన, పం ట నాణ్యత, ఆకర్షణీయమైన గుణాలతో స్థానికంగా ఆదరణ పొందాయి. ఈ రకాలు మంచి దిగుబడి ఇస్తున్నా, కుళ్లు తెగులును తట్టుకునే శక్తి లేకపోవడం పరిశోధనల్లో గుర్తించారు. ఈ తెగులు కార ణంగా దిగుబడి తగ్గిపోతుందని తెలుసుకున్నారు. రాయలసీమ ప్రాంతంలో ఈ వంకాయ రకాల సాగు విస్తృతి, ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఈ రకాల సం రక్షణ, బ్యాక్టీరియా కుళు ను తట్టుకునే నూతన వంగడాలను అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు చేస్తున్నారు. ఉద్యాన కళాశాల పీహెచ్‌డీ విద్యార్థి వి. వినయ్‌కుమార్, పెట్లూరు చీనీ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ పి. శ్యాంసుందర్ రెడ్డి, ఉద్యాన కళాశాల ఆచార్యులు డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, డాక్టర్ బి. హరివరప్రసాద్, డాక్టర్ కే. దినేష్ ఈ పరిశోధనల్లో పాల్గొంటున్నారు. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి సాగుచేసిన కూరగాయల్లో వంగ ప్రధానమైంది. ఫ్రాన్స్, ఇటలీ, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో కూడా ఈ పంటను అక్కడి రైతులు పండిస్తున్నారు. మన దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఎన్నో రకాల వంగ రకాలు పండిస్తున్నారు. ఒరిస్సా, బీహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వంగ విస్తారంగా పండిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రాల్లో వంగ సాగు విస్తీర్ణంలో 5వ స్థానంలో, ఉత్పత్తిలో 6వ స్థానంలో ఉంది. ఉత్పాదకతలో 3వ స్థానంలో ఉంది. కోస్తా ఆంధ్రలో పశ్చిమగోదావరి, విశాఖపట్నం, గుంటూరు, రాయలసీమలో చిత్తూరు, కర్నూలు, తెలంగాణాలో రంగారెడ్డి జిల్లాల్లో వంగ ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

దేశీ వంగ వంగడాలపై అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థులు ముమ్మరంగా పరిశోధనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా సర్వే చేశారు. ప్రజాదరణ పొందిన వంగ రకాలను గుర్తించి, సేకరించారు. చీడపీడలు ఆశించని అధిక దిగుబడినిచ్చే రకాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు



ఉద్యాన పరిశోధన స్థానంలో వంగ మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త


ఉద్యాన కళాశాల విద్యార్థులు సేకరించిన దేశీ రకాల వంకాయలు

సాగులో సమస్యలు

అధిక దిగుబడినిచ్చే మేలు రకాలు, సంకరజాతి విత్తనం కావాల్సినంత మేర రైతులకు లభ్యం కావడం లేదు. వినియోగదారుల అభిరుచికి తగిన రకాలు, చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు సరసమైన ధరలో రైతులకు అందుబాటులో ఉండడం లేదు. వెర్రి తెగులును తట్టుకుని అధిక దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులో లేవు. ఇన్ని సమస్యలున్నా అన్ని రుతువుల్లో సాగు చేయడానికి వీలు ఉండడం. బెట్టను తట్టుకోవడం, అంతర సేద్యం, కలుపు నివారణ తేలికగా ఉండడం వంగ సాగుపై ఆసక్తి చూపడానికి కారణమవుతోంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర రానప్పుడు చెట్టును వదలి లాభసాటి ధరలున్నప్పుడు కార్శీ పంట (రటూన్ పంట) తీసుకోవడానికి అవకాశముంటుంది. దూర ప్రాంతాలకు రవాణా చేసేందుకు అనుకూలంగా ఉంటుంది.

వంగ రకాలు

ప్రాంతీయ మార్కెట్లో వినియోగదారుల అభిరుచిని బట్టి రకాలు ఎంపిక చేసుకోవాలి. మన రాష్ట్రంలో గులాబి, పూసాక్రాంతి, పూసా పర్పుల్ క్లస్టర్, శ్యామల, భాగ్యవతి రకాలు అనుకూలం. సంకరజాతి రకాలలో ఊదారంగు గుండ్రటి రకాలు ఉన్నాయి. వీటిలో ఆర్క నవనీత్, పూసా హైబ్రీడ్-6, మహికో హైబ్రీడ్ నెం.254, ఉత్కర్ష మోహిన, అగోరా, మంజు, సంజు, మ్యూమ్యూ, ఊదారంగు గుత్తి రకాలు మహీకో, రవయ్య, మహీకో నెం.3 రకాలు ఉన్నాయి. రాయలసీమ ప్రాంతంలో ఎక్కువగా అర్కా కుసుమాకర్, దేశవాళీ పచ్చ వంగ రకాలు, రాయదుర్గం, పోలూరు రకాలను పండిస్తున్నారు.

అనంతరాజుపేటలో 40 రకాల వంగడాలు

అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణలో 40 రకాల వంగ రకాలపై పరిశోధనలు చేస్తున్నారు. కళాశాల విద్యార్థులు కొంగొత్త వంగడాలపై ముమ్మరంగా పరిశీలించి పరిశోధనలు చేసి తెగుళ్లను తట్టుకునేందుకు వీలుగా ఉండే వంగడాల ఉత్పత్తికి పరిశోధనలు చేస్తున్నారు.

తెగుళ్లను తట్టుకునే వంగడాలు



అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణలో 40 రకాల వంగ వంగడాలపై పరిశోధనలు చేస్తున్నాం. తెగుళ్లను తట్టుకునే వంగడాలను ఎంచుకుంటున్నాం. ప్రధానంగా పోలూరు, శ్రీకాళహస్తి తదితరాలను పరిశీలిస్తున్నాం.. తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి ఇచ్చే వంగడాల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నాం.

- వి. వినయ్‌కుమార్, పీహెచ్‌డీ విద్యార్థి

మంచి వంగడాలను ఎంచుకోవాలి



రైతులు మంచి వంగ వంగడాలను ఎంచుకోవాలి. తెగుళ్లను తట్టుకునే రకాలను రైతులకు ఇవ్వడానికి పరిశోధన స్థానాలు కృషి చేస్తున్నాయి. నాణ్యమైన విత్తనాలతోపాటు, యాజమాన్య పద్ధతులను సక్రమంగా పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. పరిశోధనలు వేగవంతం చేస్తున్నాం.

- పి. శ్యాంసుందర్‌రెడ్డి, పెట్లూరు పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్

కొత్త వంగడాలపై పరిశోధనలు



ఉద్యాన విద్యార్థులతో కొత్త వంగడాలపై పరిశోధనలు చేయిస్తున్నాం. రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. పరిశోధనల్లో లోటుపాట్లను పర్యవేక్షిస్తున్నాం. కూరగాయల సాగు విధానంలో విప్లవాత్మక మార్పులపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

- సయ్యద్ సదరున్నీసా, ఉద్యాన కళాశాల ప్రొఫెసర్

వాతావరణం, యాజమాన్య పద్ధతులు

వంగ ఉష్ణ మండలపు పంట. అధిక ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడిని చాలా వరకు తట్టుకోగలదు. కొండ ప్రాంతాలు, చల్లటి వాతావరణంలో మొక్క పెరుగుదల తగ్గుతుంది. అధిక చలి, మంచును తట్టుకోలేదు. బాగా నీరు ఇంకే నేలలు, ఒక మాదిరి నుంచి హెచ్చు సారవంతమైన నేలలు ఈ పంట సాగుకు అనుకూలమైనది. చౌడు భూములు పనికి రావు. నేలను 4-5 సార్లు బాగా దున్ని చదును చేయాలి. వర్షాకాలపు పంటకు బోదెలు, కాలువలు, ఏర్పాటు చేయాలి. శీతాకాలపు, వేసవి 4-5 చదరపు మీటర్ల మళ్లను తయారు చేసుకోవాలి. రకాలను బట్టి బోదెలను 75 సెంటీమీటర్లు లేదా 50 సెంటీమీటర్ల దూరంలో ఉండేలా తయారు చేసుకోవాలి. పొలంలో నాటి ముందు బాగా పారించి 30-35 రోజుల వయసు గల నారును బోదెలపై నాటుకోవాలి. నాటిన వారం రోజుల మొక్కలు చనిపోయి ఖాళీగా ఉన్న పాదులలో పై నాట్లు వేయాలి. వర్షాకాలపు పంటను జూన్-జూలైలో, శీతాకాలపు పంటను అక్టోబర్-నవంబరు మాసాల్లో, వేసవి పంటను జనవరి, రెండో పక్షం నుంచి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు నారు కోసం విత్తవచ్చు. నారు పోసిన 30 నుంచి 35 రోజుల్లో నాటుకోవాలి.

హార్సిలీహిల్స్‌లో నేడు మెగా 'యోగాంధ్ర'

- హాజరు కానున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

బి.కొత్తకోట, జూన్18 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు మండల పరిధిలోని హార్సిలీహిల్స్‌లో మెగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ బాబాజాన్, ఎంపీడీవో కృష్ణవేణి, నగర పంచాయతీ కమిషనర్‌లు చేపట్టారు. గవర్నర్ బంగ్లా ముందుభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో వేదిక ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి 1000 మందికి పైగా రప్పించేలా ఏర్పాట్లు చేశారు. వెలుగు మహిళలు, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది తరలింపు కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 6 గంటలకే యోగా ప్రారంభించేలా చూడాలని కలెక్టర్ మండల అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. జేసీ ఆదర్శరాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తో పాటు పలువురు జిల్లా, మండల అధికారులు హిల్స్‌కు రానున్నారు. బాధ్యతలు అప్పగించిన అధికారులు బుధవారం రాత్రికే హిల్స్‌కు చేరుకొని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్ ఎంపిక


ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

మదనపల్లె టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలో భాగంగా మదనపల్లెలో జట్టు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. బుధవారం స్థానిక మిషన్ కాంపౌండ్ మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జట్టు సభ్యుల ఎంపిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 మంది క్రీడాకారులు ఈ ఎంపికకు హాజరు కాగా వీరిలో 30 మందిని ఎంపిక చేసి, శిక్షణ శిబిరం నిర్వహిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. శిక్షణ తరువాత తుది జట్టును ఎంపిక చేసి, ఈనెల 29, 30 తేదీల్లో మదనపల్లెలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిక కమిటీ సభ్యులు జాన్ కమలేశ్, అభిలాష్, బాలాజి పాల్గొన్నారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

లక్కిరెడ్డిపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల నేపథ్యం ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. చాగలగుట్టపల్లికి చెందిన రామాంజనేయులు(38) భార్య పిల్లలతో కలిసి బెంగుళూరులో నివసిస్తుంటాడు. వారం రోజుల క్రితం కుటుంబంతో కలసి స్వగ్రామానికి వచ్చాడు. ఈ మధ్య కాలంలో భార్య తనతో మాట్లాడడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు రాయచోటిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవి పందులను చంపినందుకు ఇద్దరి అరెస్టు


నిందితులతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అడవి పందులను చంపి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు రేంజర్‌రాయచోటి వైపు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సానిపాయి బీట్‌లోని ఎర్రచేను ప్రాంతంలో నక్క నాగరాజు, జగన్నాథం బాలు కలసి రెండు అడవి పం దులను వేటాడారు. వాటిని సంచిలో మూటగట్టుకుని ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాం డుకు తరలించినట్లు తెలిపారు. సానిపాయి, జాండ్రపేట, ఎఫ్‌బీవోలు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకును తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు


కొడుకును తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ

సిద్దవటం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా ఆచూకీ లేకుండా పోయిన యువకుడిని గుర్తించి మంగళవారం వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. బుధవారం పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సిద్దవటం మండలం డేగనవాండ్లపలెకు చెందిన కంచర్ల నవీన్‌కుమార్‌రెడ్డి బీటెక్ చదివాడు. ఉద్యోగం కోసమని మూడేళ్ల క్రితం హైదరాబాదుకు వెళ్లాడు. గ్రూప్ కోచింగ్ కూడా తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో తల్లిండ్రులకు ముఖం చూపించలేక అక్కడే క్యాంటీన్‌లో ు, సినిమా ఫీల్డ్‌లో వర్కర్‌గా పనిచేసేవాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులకు కనీసం ఫోన్ కూడా చేయలేదు. దీంతో తల్లి కంచర్ల తులశమ్మ, తండ్రి రామసుబ్బారెడ్డి నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 14న పోలీసులు హైదరాబాదులో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు నవీన్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని ఈ నెల 17న స్థానిక పోలీసుస్టేషన్‌లో తల్లి దండ్రులకు అప్పజెప్పామని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారని ఎస్ఐ మహమ్మద్‌రఫీ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

గుమ్మసముద్రం సచివాలయంలో ఘర్షణ

- ముగ్గురికి గాయాలు ● డిజిటల్ అసిస్టెంట్ పై కేసు నమోదు



గాయపడిన గ్రామస్తులు, వాగ్వాదం చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

బి.కొత్తకోట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాల్సిన ఓ ఉద్యోగి విచక్షణ కోల్పోయి గ్రామస్తులతో ఘర్షణ పడ్డాడు. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలి పిన వివరాల మేరకు పంచాయతీ పరిధిలోని గండువారిపల్లెకు చెందిన శంకర బుధవారం తన భార్యతో కలిసి సచివాలయానికి వచ్చాడు. తమ పిల్లలకు తల్లికి వందనం నిధులు పడలేదని, ఎందుకు పడలేదో చూడాలని డిజిటల్ అసిస్టెంట్ బాబా పక్రుద్దీన్‌ను అడిగాడు. అయితే, సరైన సమాధానం చెప్పకపోగా, దురుసుగా బదులిచ్చాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం ప్రారంభమైంది. మాటామాటా పెరగటంతో బాబాపక్రుద్దీన్ తనకు అందుబాటులో వున్న వస్తువుతో దాడి చేయడంతో శంకర, అన్న నాగ భూషణం గాయపడ్డారు. ఘటనలో డిజిటల్ అసి స్టెంట్‌కు సైతం స్వల్ప గాయాలవడంతో పాటు దుస్తులు చిరిగిపోయా యి. తాము తల్లికివందనం నిధు లు పడినాయా అని అడిగితే డిజిటల్ అసిస్టెంట్ తమపై దాడి చేసి గాయపరిచాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన వారిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

లక్కిరెడ్డిపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూడిదగుంటపల్లెకు చెందిన సుబ్బగారి రామాంజనేయులు (38) అనే రైతు అప్పుల బాధ తాళలేక బుధవారం పొలం వద్ద ఉన్న షెడ్డులోని రాడ్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మృతుడు రామాంజనేయులు పంటలు సాగు చేసేవాడని వేరుశనగ్గ మామిడిలో నష్టాలు రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి

పెద్దతిప్పసముద్రం జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి సూచించారు. స్థానిక కల్యాణ మండపంలో వినియోగ దా రులు, ట్రాన్స్‌కో సిబ్బందికి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించి, సోలార్ విద్యుత్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. థర్మల్ విద్యుత్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరిగే అవకాశం ఉందని, అందుకే కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టిసారించిందన్నారు. సోలార్ విద్యుత్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు బ్యాంకులు విరివిగా రుణాలు ఇస్తున్నాయన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా గృహ వినియోగదారులకు ఒక కిలో వాట్‌కు రూ 30,000, రెండు కిలో వాట్‌లకు రూ. 80,000, మూడు కిలో వాట్లకు రూ. 78,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నదని, ప్రజలు తమ విద్యుత్ చార్జీలను ఆదా చేసుకోవడానికి ఇంటిపై సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ వినియోగంతో పాటు, 70 శాతం విద్యుత్ బిల్లు కూడా తగ్గుతుందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ విషయాలను, బ్యాంకుల ద్వారా, అందుబాటులో ఉన్న రుణాల విషయం ప్రజలకు వివరించాలన్నారు. సోలార్ రూఫ్‌టాప్ అమర్చుకునేందుకు సహకారం అందించాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దతిప్పసముద్రం ఏఈ గిరిధర్, లైన్ ఇన్‌స్పెక్టర్ కందుకూరి రమణ, జూనియర్ లైన్‌మన్ రమణ, మడుమూరు లైన్ ఇన్‌స్పెక్టర్ పాపన్న, టి.సదుం లైన్‌మన్ వెంకటరెడ్డి, ఏఎల్ఎం, పి. మంజునాథ్, సబ్‌స్టేషన్ సిబ్బంది పాండురంగయ్య, వెంకటరామయ్య, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేక.. రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

- వారం తర్వాత భర్త మృతి, భార్య పరిస్థితి విషమం


నాగేంద్రరెడ్డి మృతదేహం

సిద్దవటం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. వీరు ఈనెల 10న తిరుపతిలోని ఓ లాడ్జిలో పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం భర్త నాగేంద్రరెడ్డి (35) మృతి చెందగా.. ప్రాణాపాయ స్థితిలో పుష్పవేణి చికిత్స పొందుతున్నారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. సిద్దవటం మండలం డేగనవాండ్లపల్లెకు చెందిన నిమ్మకాయల నాగేంద్ర రెడ్డికి కొంత పొలం ఉంది. వీరికి 8, 6 ఏళ్ల వయసున్న ఇద్దరు పిల్లలున్నారు. పంటల సాగుకు అధిక వడ్డీలకు లక్షలాది రూపాయలు అప్పులు చేశారు. వ్యవసాయం కలిసిరాక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక సతమతమయ్యారు. ఈ క్రమంలో చనిపోవాలని భావించారు. కుమారుడు అమరనాథ రెడ్డి, కూతురు లావణ్యను తన తల్లిదండ్రులు మునిరెడ్డి, పార్వతమ్మ వద్ద వదిలి.. తాము తిరుమలకు వెళ్లొస్తామని చెప్పారు. ఈ నెల 9న తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. మరుసటి రోజు పురుగుల మందు తీసుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఈస్ట్ పోలీసులకు లాడ్జి మేనేజర్ సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పోలీసులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేంద్రరెడ్డి బుధవారం మృతి చెందాడు. పుష్పవేణి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మృతదేహాన్ని రుయాఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు. భార్యాభర్తలు విషం తీసుకోవడం వెనుక కారణాలు, ఎవరెవరి వద్ద అప్పులు చేశారు? ఎందుకు చేశారు? డబ్బుకోసం ఎవరైనా వేధింపులకు గురి చేశారా అనే కోణాల్లో విచారణ చేస్తున్నామని సీఐ చెప్పారు.

తాగునీటి పైపులైన్‌కు సబ్సిడీ పైపులు!?



మిట్టమీదవారిపల్లిలో ఏర్పాటు చేసిన పైపులైన్ (పక్కన) పైపులైన్‌కు వాడిన సబ్సిడీ పైపులు (పైన)

నిమ్మనపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. గతంలో వైసీపీ నేతలు ఇసుక, శాండ్, క్వారీలను ఇష్టారాజ్యంగా దండుకోవడమే కాకుండా, ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు సబ్సిడీ ద్వారా మంజూరైన పనిముట్లను కూడా వదల్లేదు. కొండయ్యగారిపల్లి పంచాయతీ ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పంచాయతీ సర్పంచ్ వరలక్ష్మి భర్త శశిధర్‌రెడ్డి మిట్టమీదవారిపల్లిలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశాడు. ఇందుకోసం వాటర్‌షెడ్ పరిధిలోని రైతులకు ప్రభుత్వం సబ్సిడీ పై మంజూరు చేసిన పైపులను వినియోగించాడు. ఆ పైపులు నాసిరకంగా ఉండడంతో రాళ్లు పడితే పగిలి పోయే పరిస్థితి. వెంకోజిగారిపల్లిలో మురుగుకాలువలు బాగానే ఉన్నా, వాటిపై మళ్లీ ఎత్తుగా గోడ కట్టి బిల్లు లు చేసుకునేందుకు పథకం రూపొందించారు. దీనినిబట్టి పంచాయతీలో ఏమేర అవినీతి జరుగుతోందో అర్థమవుతోంది. వైసీపీ ప్రభుత్వంలో వాటర్‌షెడ్ కింద మూడు పంచాయతీలు ఎంపికయ్యాయి. ఇలాంటి గ్రామాలకు ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, పైపు లు, టార్పాలిన్ పట్టలు, చాఫ్ కట్టర్లు వంటివి మంజూరు చేస్తుంది. భూముల్లో నీరు నిల్వ చేసేందుకు కట్టలు, కుంటలు వంటి పనులు చేసుకునేందుకు నిధులు మంజూరు చేస్తుంది. కొండయ్యగారిపల్లి పంచాయతీలో రైతుల నుంచి పాస్ పుస్తకాలు సేకరించి వారికి తెలియకుండా వాటర్‌షెడ్ ద్వారా వచ్చే పనిముట్లను కాజేశారు. వాటర్‌షెడ్ పనులు చేయకనే కట్టలు వేసినట్లు బిల్లులు చేసుకున్నారు. ఇప్పుడు కూడా స్టోర్ డీలర్‌గా ఉంటూ, ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నాడు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం గమనార్హం. తాగునీటి పైపులైన్‌కు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన పైపులు అమర్చడంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తిని వివరణ కోరగా ఆయన స్పందించ లేదు. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్


ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న వెంకటమోహన్

చిన్నమండెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై గ్రామీణులకు అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) వెంకటమోహన్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీసీఎన్ఎఫ్ క్యాండర్లు యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్‌పీలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయం ప్రగతిపై రివ్యూ చేశారు. ముఖ్యంగా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానాన్ని ప్రతి రైతు అమలు చేయాలని పిలుపునిచ్చారు. మామిడి తోటల్లో 30 రకాల విత్తనాలను కలిపి విత్తడం వలన నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడమే కాకుండా జీవవైవిధ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందన్నారు. వేరుశనగ పైరులో అంతర పంటలుగా కందులు, అలసందలు, అనప, ఆముదం, జీవవైవిధ్య పంటల గురించి తెలిపారు. ఇవి వర్షాభావ పరిస్థితిలో వేరుశనగ దిగుబడి రాకపోయినా అంతర పంటల ద్వారా అదనపు ఆదాయాన్ని రైతులకు అందిస్తాయని, ప్రధాన పంటకు తెగుళ్లు రాకుండా అరికడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఎంటీఎల్ చందురెడ్డి, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసులు, పద్మావతి, ఇంటర్న్ యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్‌పీ పాల్గొన్నారు

విద్యార్థుల సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

- 32 వేల మంది 'తల్లికి వందనం' లబ్ధిదారులకు రూ.48 కోట్ల పంపిణీ ● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విద్యార్థినులు

మదనపల్లె టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో నియోజకవర్గంలోని 32 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో పాటు, అదనంగా మరిన్ని పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం పెడుతోందన్నారు. విదేశీ విద్యకు ప్రతి విద్యార్థికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తోందన్నారు. డీఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ తల్లికి వందనం అందని అర్హులైన వారందరికీ తప్పక ఈ పథకం అందేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం ఈ పథకంలో లబ్ధి పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే చెక్కు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీవైఈవో లోకేశ్వరరెడ్డి, ఎంఈవోలు ప్రభాకర్ రెడ్డి, రాజగోపాల్, పద్మావతి, హేమలత, హెచ్ఎం సుబ్బారెడ్డి, జనసేన రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్ దారం అనిత, టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, నాదెళ్ల శివన్న, నీలకంఠ, సుద్దిళ్ల సుధాకర్, మహ్మద్‌ఖాన్, బాబాఫకృద్దీన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత.. సుఖీభవ..!

● ఈనెల 20లోపు అవకాశం ● రైతన్నా స్పందించు.. ఈకేవైసీ చేయించు.. ● కసరత్తు చేస్తున్న వ్యవసాయ యంత్రాంగం

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సాగులో పెట్టుబడి ఖర్చుల తగ్గింపు, పంటల విక్రయం సులభతరం చేయడంతో పాటు రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకాన్ని తీసుకొచ్చింది. అర్హులైన రైతులకు ఏడాదికి సాగు ఖర్చులకు రూ.20 వేలు ఆర్థికసాయం అందిస్తుంది. ఈనెల 20వ తేదీ తర్వాత ఈ పథకం అమలుకు కసరత్తు చేస్తోంది. మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని నిర్ణయించింది.

ఈకేవైసీ ఇలా..

తొలకరి వానలు పలుకరిస్తున్నాయి. రైతులు ఏరువాక పనులకు సన్నద్ధమవుతున్నారు, ఖరీఫ్ కోసం పొలాలను సిద్ధం చేస్తున్నారు. సూపర్-6 పథకాలు అమలులో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం సమాయత్తం అయింది. ఈకేవైసీ చేయించుకునేందుకు క్షేత్రస్థాయిలో వివరాలను పూర్తి చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రొద్దుటూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 21,293 మంది రైతులు ఉన్నారు. వీరిలో ప్రొద్దుటూరు మండలంలో 3,940 మంది రైతులకు 3,807 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోగా 133 మంది మిగిలి ఉన్నారు. జమ్మలమడుగు మండలంలో 4292 మందికి 4163 మంది చేయించుకోగా 129 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. మైలవరం మండలంలో 5861 మందికి గాను 5756 మంది చేయించుకోగా 105 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. పెద్దముడియం మండలంలో 7191 మందికి 7011 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోగా 180 మంది ఈ పక్రియను పూర్తి చేయాల్సి ఉంది.

రైతులకు ఊరట

ఈ నెల 20 లోగా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలి. గడువు తక్కువగా ఉండడంతో ఈ ప్రక్రియ కష్టంగా మారింది. ఈ నేపద్యంలో ఇప్పటికే ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలను అనుసంధానం చేస్తూ ఊరట కల్పించింది ప్రభుత్వం. రైతులందరు రైతు సేవా కేంద్రాలకు వచ్చి ఈకేవైసీ నమోదు చేయించుకోవాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వద్ద వివరాలు లేని రైతులు మాత్రమే వేలిముద్రలు వేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు వారి జాబితాలను రైతు సేవా కేంద్రాలకు పంపించింది. దీంతో అర్హుల గుర్తింపు సులభతరం అయింది. వీరందరు ఈకేవైసీ చేయించాలని ఆదేశించింది.



ఇలా తెలుసుకోవచ్చు..

రైతులు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ అన్నదాత సుఖీభవ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో క్లిక్ చేస్తే పేజీ తెరచుకుంటుంది. ఇందులో యువర్ స్టేటస్ అని కనపడుతుంది. దానిపై క్లిక్ చేస్తే ఆధార్ నంబరు అడుగుతుంది. ఆధార్ సంఖ్యను నమోదు చేసి పక్కనున్న క్యాప్చర్ ఎంటర్ చేసి సెర్చ్ నొక్కితే రైతు పేరు, పొలం ఉన్న గ్రామం పేరు, చివరిలో ఏఎంవో ఆమోదం (అప్రూవల్డ్) అని కనిపిస్తుంది. ఇలా రైతుకు సంబంధించిన వివరాలు కనిపిస్తే పథకానికి అర్హత పొందినట్లు అని అధికారులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రైతులు సులభంగా పథకంలో అర్హత ఉందో లేదో తెలుసుకుంటున్నారు. పేరు లేకపోతే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి కారణాలు తెలుసుకోవచ్చునని సూచించారు.



రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకుంటున్న రైతులు

21న తొలి విడత

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20 వేలు చొప్పున ఆర్థికసాయం అందిస్తామని సూపర్-6లో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనికి అనుగుణంగా అర్హులైన కుటుంబాలకు మూడు విడతల్లో సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈనెల 21వ తేదీన తొలివిడతగా రైతుల ఖాతాల్లో రూ.7వేలు జమ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు ప్రకటించారు.

ప్రక్రియ పూర్తి చేస్తాం..



అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ చేయించుకోని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఈకేవైసీ చేయించుకోని రైతులు తక్కువ మంది ఉన్నారు. రైతులకు సర్కారు ఊరటనిస్తూ వివిధ పథకాల్లోని ఈకేవైసీ జాబితాను సుఖీభవ అర్హులతో అనుసంధానించేందుకు ప్రక్రియ సులభతరం చేసింది. అర్హులైన వారికి సాయం అందేలా ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది.

\- పి.సురేష్‌రెడ్డి, ఏడీఏ, ప్రొద్దుటూరు డివిజన్

గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

జమ్మలమడుగు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక మ్యాపులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తుండగా .. ఒబేరాయ్ సంస్థ ఆతిధ్య సేవల కోసం సిద్ధమవుతోందని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం గండికోట పర్యాటక కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు కలిసి సుప్రసిద్ధ ఒబేరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించిన స్థలాలను పరిశీలించారు. అనంతరం సమీపంలోని మైలవరం బోటింగ్ పాయింట్‌ను, అక్కడకు వెళ్లే మార్గాన్ని ఎమ్మెల్యే ఆదితో కలిసి పరిశీలించి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాచుర్యం పొందిన గండికోట పర్యాటక కేంద్రం భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాశిస్తోందనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఆదిశగా ఇప్పటికే గండికోట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. మరోవైపు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తూ అధునాతన, విలాసవంతమైన సదుపాయాలతో స్టార్‌హోటళ్ల సముదాయాన్ని ఏర్పాటు చేసేందుకు ఒబేరాయ్ సంస్థ ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఒబేరాయ్ హోటల్స్ ఏర్పాటులో భాగంగా ఆ సంస్థ చేపట్టే నిర్మాణాల వివరాలు, మౌలిక సదుపాయాలు అయిన రోడ్లు, హెలిప్యాడ్, రిస్టార్ట్ భవనాలను నిర్మించనున్నారన్నారు. అనంతరం కలెక్టర్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, జిల్లా టూరిజం అధికారి సురేష్‌కుమార్, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● ఇంటింటా ప్రచారంలో ఉపాధ్యాయులు



ఇంటింటా ప్రచారంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని కడప శివారులోని రాజీవ్ గృహకల్పలోని (21వ వార్డు) నగరపాలక మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. బుదవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులోచనరాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎస్వీ ప్రసాదరెడ్డి, లక్ష్మినారాణమ్మ, జె.ఆనందకుమార్, టి.సత్యనారాయణ, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ సల్మాన్‌ఖాన్, సిబ్బంది విజయ కలిసి ఇంటింటికి వెళ్లి విద్య ఆవశ్యకతను వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగు, యూనిఫాం, బెల్ట్, షూ, సాక్సులు, మధ్యాహ్నం పౌష్టికాహారం ప్రభుత్వం పిల్లలకు అందిస్తోందని అవగాహన కల్పిచారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థి అమ్మ అకౌంట్‌లో తల్లికి వందనంపేరుతో ప్రభుత్వం రూ.15వేలు జమచేస్తోందన్నారు. అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

ప్రొద్దుటూరు, ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్, సిద్దారెడ్డిలను వీఆర్‌కు ఆదేశిస్తూ బుధవారం ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపారు. ఇటీవల లక్ష్మి నరసింహ అనే క్రికెట్ బుకీ తన వద్ద వీరు మామూళ్ల రూపంలో నగదును వసూలు చేసి ఆపై వేధించారని సోషల్ మీడియా వేదికగా వీడియో కూడా విడుదల చేశాడు. ఈక్రమంలో వీరిపై అవినీతి ఆరోపణలు రావడం తో ఈమేరకు ఉన్నతాధికారుల చర్యలు తీసుకున్నారు. వీరిలో రాజ్‌కు మార్ ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యి వీఆర్‌కు వెళ్లగా, సిద్దారెడ్డి ప్రస్తు తం విశాఖపట్నంలోని ప్రదానమంత్రి పర్యటన నేపద్యంలో బందో బస్తు విధులకు వెళ్లారు. అక్కడి నుంచి రాగానే జిల్లా ఎస్పీ కార్యా లయంలో హజరుకానున్నారని ఆయన వివరించారు.

క్రిష్టంపల్లె పాఠశాల అభివృద్ధికి కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్

పోరుమామిళ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణంపల్లె పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్ అన్నారు. మంగళ వారం ఆయన ఆ పాఠశాలను పరిశీలించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సన్నబియ్యం వచ్చాక తేడాను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను హైస్కూలుగా మార్చడానికి ఎందుకు ప్రపోజల్ పంపలేదని అడిగారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఈ పాఠశాలను దత్తతగా తీసుకుంటానని, ఇప్పటి నుంచి ఇది మనందరి పాఠశాల అని, అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులు కూడా తమ వంతు సహాయం చేసి భాగస్వాములు కావాలన్నారు.

డ్వాక్రా మహిళల అభివృద్ధే లక్ష్యం



డ్వాక్రా సంఘ సభ్యులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టరు

వల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): డ్రాక్వా గ్రూపులోని ప్రతి మహిళ తమ కాళ్లపై తాము నిలబడేందుకు అహర్నిశలు కృషి చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎ.ఓబాయపల్లెలో శ్రీలక్ష్మి నరసింహస్వామి ఎస్‌హెచ్‌సీ సభ్యురాలైన దాసరి కేశమ్మ నిర్వహిస్తున్న రంగుల దుకాణాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలలో ఉన్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో తాము కృషి చేస్తున్నామన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు అందించి వారి అభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. తీసుకున్న రుణాన్ని సక్రమ పద్ధతిలో వినియోగిస్తే ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఏపీయం పూర్ణిమ, ఉన్నతి సంఘ సభ్యులు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చాపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యపాడు దళితవాడలోని ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలో మొత్తం 55 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 15 మంది 1, 2 తరగతులకు చెందిన వారు. మిగిలిన 3, 4, 5 తరగతులకు చెందిన విద్యార్థులు. ఈ విద్యార్థులను గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మోడల్ పాఠశాలలో చేర్పుతున్నారు. మరికొంత మందిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుపుతున్నారు. అధికారుల అలా చేయవద్దని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేటప్పుడు గ్రామంలో ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఎక్కువగా తిరుగుతున్నాయని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అందువలన ఇప్పుడున్న పాఠశాలలోనే విద్యార్థులందరిని కొనసాగించాలని వారు కోరుతున్నారు.

కడప కార్పొరేషన్‌లో టీడీపీ జెండా ఎగురవేయాలి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కడపలో టీడీపీని బలోపేతం చేసి కార్పొరేషన్‌లో టీడీపీ జెండా ఎగుర వేసేం దుకు టీడీపీ శ్రేణులన్నీ కష్టపడి పనిచే యా లని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డిలు పిలుపు నిచ్చా రు. బుధవారం కడపలోని ఎమ్మెల్యే నివా సంలో టీడీపీ కడప నగర సంస్థాగత ఎన్ని కల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో పార్టీ సంస్థాగత నిర్మాణం లేకపోయినప్పటికీ ఎని మిది నెలలు కష్టపడి పనిచేసి ఎమ్మెల్యేగా మాధవిరెడ్డిని గెలిపించు కున్నామన్నారు. అదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పనిచేసి కడప కార్పొరేషన్‌లో టీడీపీ జెండా ఎగురవేయాలన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు విడ తలవారీగా పదవులు ఇస్తామని, ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉంటామన్నారు. బూత్, డివిజన్, నగర అనుబంధ కమిటీల సభ్యులు నిత్యం ప్రజలలోకి వెళ్లి వారి సమ స్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కొంత మంది కార్యకర్తలు పైరవీలు చేసి అవినీతికి పాల్పడుతున్నారని, అలా చేసి స్థాయిని దిగజార్చుకోవద్దని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి లబ్ధిచేకూరుస్తామని తెలిపారు. పార్టీకి ద్రోహం చేసేవారిని క్షమించే సమస్య లేదన్నారు. వచ్చే నెలలో నగరంలోని 50 డివిజన్లకు సంబంధించిన అభ్యర్థులను అన ధికారికంగా ఖరారు చేస్తామన్నారు. ఇప్పటి నుంచే అన్ని డివిజన్లలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. టీడీపీ నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, జిలాని బాష పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

రూ.కోటి వ్యయంతో కేసీ కెనాల్ పరిశుభ్రత

బుక్కవంక శుభ్రతకు తీసుకున్న చర్యల తరహాలోనే కేసీ కెనాల్‌ను కోటి రూపాయల వ్యయంతో పరిశుభ్రం చేస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి తెలిపారు. బుధవారం కడప నగరం కేసీ కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న దోమల భూతాన్ని తగ్గించేదుకు ఇప్పటికే కోటి రూపాయల బడ్జెట్‌తో క్లీనింగ్ ప్రాసెస్ ప్రారంభించి గేటు ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థను వేరు చేస్తూ శుభ్రత చర్యలు చేపడుతున్నారన్నారు. స్వచ్ఛమైన కడప కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని డీసీఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంశంకర్ (23) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టుటౌన్ ఎస్ఐ ధనుంజయుడు వివరాల మేరకు.. యూపీలోని షాజహాన్‌పూర్ జిల్లా గుత్తేటి ఉత్తర్ గ్రామానికి చెందిన రాంశంకర్ జీవనోపాధి కోసం అయిదేళ్ల కిందట ఇక్కడికి వలస వచ్చారు. తోపుడు బండిలో చెనిక్కాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇతనికి ఎనిమిది నెలల కిందట పింకి అనే యువతితో వివాహమైంది. రాంశంకర్ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పలుమార్లు నచ్చజెప్పారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటలకు మద్యం తాగిన రాంశంకర్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం సినీహబ్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలోని కంపచెట్లలో చున్నీకి ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ ధనుంజయుడు, పోలీసులు మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీజల్ దొంగల అరెస్టు



పట్టుబడ్డ దొంగలతో సీఐ, పోలీసులు

ఎర్రగుంట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తరచు లారీల నుంచి డీజల్ దొంగిలిస్తున్న ముగ్గురు దొంగలను ఎర్రగుంట్ల పోలీసులు మంగళ వారం అరెస్టు చేశారు. సింహాద్రిపురం మండలానికి చెందిన పసల కిషోర్, గంగనపల్లి సిద్దయ్య, మూడే వంశీనాయక్‌లు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించే నేపద్యంలో డీజల్ దొంగ తనాలకు అలవాటు పడ్డారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం చిలమ కూరులోని మోహన్‌రెడ్డి పెట్రోల్ బంకు వద్ద లారీలోని డీజల్ తీస్తుం డగా గమనించిన లారీ యజమాని దస్తగిరి గట్టిగా అరచాడు. వెంటనే ఈ ముగ్గురు దొంగలు దస్తగిరి గొంతుపై కత్తిపెట్టి అరిస్తే చంపుతా మని బెదిరించారు. అతన్ని చుట్టుముట్టి రూ.2500 నగదు, 200 లీటర్ల డీజల్‌ను దొంగిలించారు. ఇదే కాకుండా ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కమలాపురం తదితర ప్రాంతాల్లో చాలాసార్లు డీజల్ దొంగతనం చేశారు. ముగ్గురు దొంగలను ముద్దనూరు మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఆటో, మోటార్ సైకిల్‌తో డీజల్, రూ.2500 డబ్బును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక మహిళ మృతి

పులివెందుల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారెడ్డికాలనీకి చెందిన మంజుల (40) అనే మహిళ అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే ....రాజారెడ్డి కాలనీలో ఉండే మంజులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్దకు మార్తె బీటెక్, మరో కుమార్తె డిగ్రీ చదువుతోంది. వీరి చదువుల కోసం దాదాపు రూ.5లక్షల మేర అప్పులు చేసిం ది. ఈ అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక 14వ తేదీ విష ద్రావణం తాగి తన ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్ప డింది. ఈమెను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీనిపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సిద్ధార్థ తెలిపారు.

విష పురుగు కుట్టి వ్యక్తి మృతి

కడప క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రామక్రిష్ణనగర్‌లో వార శివబండయ్య (35) అనే వ్యక్తిని విషపురుగు కుట్టడంతో మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. రామక్రిష్ణనగర్‌కు చెందిన శివబండయ్య కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం రాత్రి ఇంట్లో కింద పడుకుని నిద్రపోతున్న సమయంలో విషపురుగు కుట్టి మరణించినట్లు తెలిపారు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

చెన్నూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డాయపల్లెలో బుధవారం సాయంత్రం ఓ మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి గొలుసు లాక్కెళ్లారు. స్థానిక కేవోఆర్ కాలనీలో యానిమేటరుగా పనిచేసే ఇంద్రావతి విధి నిర్వహణలో భాగంగా బుడ్డాయ పల్లెకు వచ్చారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో అతి వేగంగా వచ్చి ఒక్కమారుగా ఆ మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లాడు. ఆమె ప్రతిఘటించే ప్రయత్నం చేసేలోపు 4 తులాల గొలుసు లాక్కొని పారిపోయాడు. ఈ మేరకు బాధిత మహిళ స్థానిక పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గండిలో హుండీల లెక్కింపు



చక్రాయపేట,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుం డీల లెక్కింపు కార్య క్రమం నిర్వహించారు. ఈ లెక్కింపు ద్వారా రూ.20,81,450 ఆదాయం వచ్చిందన్నారు. అలాగే నిత్య అన్నదాన పథకం ద్వారా రూ.29,163 ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయ ధర్మాదాయశాఖ జిల్లా సూపరింటెండెంట్ రమణమ్మ, దేవస్థాన ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, పోలీసులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ ఇంటికి ఉచిత విద్యుత్

ప్రొద్దుటూరు , జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ అమర్చుకుని ఉచిత విద్యుత్ పొందవచ్చని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ తెలిపారు. బుధవారం స్థానిక డివిజనల్ విద్యుత్ కార్యాలయం ఆవరణలో సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసదస్సులో ఎస్ఈ రమణ మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ బిగించుకునే వారికి బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పిస్తున్నాయ న్నారు. కేవలం రూ.8 వేలు డౌన్ పేమెంట్ చెల్లిస్తే కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అంతే కాకుండా సోలార్ ప్యానల్ నిర్మించుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. వ్యాపార సంస్థలు, స్కూళ్ళ, ఆసుపత్రులు ఈ సోలార్ ప్యానల్స్‌ను ఉపయోగిస్తే ఉచిత విద్యుత్ లభిస్తుందన్నారు. ఈఈ రమణారెడ్డి, డీఈఈలు, శ్రీనివాసులరెడ్డి, శిరీష బ్యాంకర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

పనిగంటల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 20న ఆందోళన

కడప సెవెన్ రోడ్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది గంటల పని విధానాన్ని రాష్ట్రంలో 10గంటలకు పెంచడానికి వ్యతిరేకిస్తూ జూన్ 20నరాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలాధ్వర్యంలో జరిగే ఆందోళన కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏఐటీయూసీ నగర ముఖ్య కార్యకర్తలసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదంచిన పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని, నిర్బంధపు ఓవర్ డ్యూటీ చేయించడానికి మానుకోవాలని, భద్రతలేనిరోజుల్లో శ్రామిక మహిళల చేత రాత్రిళ్ల పనిచేయడం ఆపాలని, ఏరంగంలో పనిచేసే కార్మికునికైన కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కార్పొరేట్,ప్రైవేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్‌చేశాయి. బుధవారం నదరంలోని ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్య క్రమంలో పీఎస్‌వైఎఫ్ రాష్ట్రకన్వీనర్ ఓబులేసు, టీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు జయరాజ్, ఎన్‌డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ , పీఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ బయన్న, టీఆర్ఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్,కన్న,ఎన్‌డీఎస్ఎఫ్ నాయకుడునాయుడు,చంద్ర పాల్గొన్నారు.

పశువుల షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పశువుల తొట్లు పశువుల షెడ్ల ప్రతిరైతు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం కమలాపురం మండలంలోని పాచికలపాడు, గోపులాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు నిర్మించిన పశువుల షెడ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గౌస్‌బాషా, ఏపీవో పార్థసారథి పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం

కడప ఎడ్యుకేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభ్యున్నతికి 1973-76 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఎస్.మేరీ జోష్ఫినమ్మ లక్ష రూపాయలు, డి.వెంకటలక్ష్మి రూ.25వేలు, వి.శ్రీకుమారి రూ.25వేలు మొత్తం రూ.1.50లక్షలు ప్రకటించారు. బుధవారం కడప నగరంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీం బాషకు చెక్కులను అందజేశారు.పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్ సలీబాష అభినందించారు.

రాజంపేటకు ఇన్‌చార్జిని నియమించండి

కడప ఎర్రముక్కపల్లె,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజక వర్గానికి తనను టీడీపీ ఇన్‌చార్జిగా నియమించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ సీఎం చంద్రబాబును కోరారు. బుధవారం అమరావతి సచివాలయంలో చంద్రబాబును ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని హరిప్రసాద్ తెలిపారు.


సీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న హరిప్రసాద్

ఏదీ నాటి వైభవం..!

కళావిహీనంగా కళాక్షేత్రం ● అరకొర సదుపాయాలు ● కళాకారులకు ప్రోగ్రాంలు లేక వెలవెల



కళాకారులు లేని కళాక్షేత్రం

కడప కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు నాటకాలతో కళకళలాడే కళాక్షేత్రం ప్రస్తుతం కళావిహీనంగా దర్శనమిస్తుంది. పేరుకే కళాక్షేత్రం కానీ అక్కడ కళాప్రదర్శనలు లేక బోసిపోయినట్లుగా మారింది. ఎప్పుడూ గేట్లుకు తాళాలే తప్ప కళాక్షేత్రాన్ని తిరిగి పూర్వవైభవం దిశగా చేయాలనే ఆలోచన కార్పొరేషన్ అధికారులకు లేదు. నగర నడిబొడ్డున 1991 ఆగష్టు 15న కళాక్షేత్రం ఏర్పాటైంది నాటి నుంచి కొన్ని సంవత్సరాలపాటు అందులో వివిధ కళాప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొంది. అప్పట్లో కళాక్షేత్రం అన్ని హంగులు, ఆర్భాటాలు, సదుపాయలతో ఉండేది. కాగా ప్రస్తుతం ఫ్యాన్లు ఉన్నప్పటికీ తిరగవు. లైట్లువెలగవు. మరుగుదొడ్లు కంపు కొడుతూ కళాక్షేత్రం చుట్టుపక్కల పరిసరాలు అపరిశుభ్రతతో నిండుకుని ఉంది. పైపెచ్చు ఏదేని ప్రదర్శనలకు కానీ, ప్రైవేటు ప్రదర్శనలకు గానీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసుకునేందుకు అక్కడికి వెళ్లి వాకబు చేస్తే అక్కడున్న సిబ్బంది ఇక్కడా సరైన సదుపాయాలు లేవు, ఇతర ప్రైవేటు స్థలాలను చూసుకోపోండని చెప్పి మరీ తిప్పిపంపుతున్నారు. దీంతో కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో కళాక్షేత్ర పరిశుభ్రతకు వీలుగా ఇద్దరు స్వీపర్లు పనిచేసేవారు. ప్రస్తుతం ఒక స్వీపరు, ఒక మేనేజరు, ఒక కేర్ టేకర్ అక్కడ ఉన్నా వారు లేనట్లేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజూఉదయం 10గంల నుంచి సాయంత్రం 5 వరకు కళాక్షేత్రం తెరిచి ఉంచాల్సి ఉన్నప్పటికీ అక్కడ సిబ్బంది ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి దాపురించింది. అలా కావడానికి ప్రధాన కారణం ఎప్పుడు చూసినా కళాక్షేత్రానికి తాళాలు వేసి ఉండడమే.


మూలనపడేసిన కుర్చీలు, సోఫాలు, కళాక్షేత్రం గేటుకు తాళాలు వేసిన దృశ్యం

వ్యాపార కేంద్రంగా కళాక్షేత్రం..: కళలతో కళాకారులతో నిండి ఉండాల్సిన కళాక్షేత్రం వ్యాపార కేంద్రంగా అప్పుడప్పుడు దర్శనమిస్తుంది. ఏదేని ప్రైవేటు సంస్థలు నెలలో వారం పదిరోజులు పాటు అక్కడ వివిధ రకాల వస్తువులు , దుస్తులు, ఇంటికి కావాల్సిన వస్తువుల విక్రయ కేంద్రంగా కళాక్షేత్రం మారుతుంటుంది. దీంతో నగరవాసులు ఇది కళాక్షేత్రమా, లేదా వ్యాపార కేంద్రమా అని ధోరణిలో ఆలోచిస్తున్నారు. కాగా కళావిహీనంగా ఉన్న కడప కళాక్షేత్రాన్ని అన్ని హంగులతో సర్వాంగసుందరంగా తీర్చి కళాకారులకు వివిధ కళాప్రదర్శనలు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించాలి. కళాక్షేత్రంలో ప్రదర్శనలు ఇచ్చేందుకుగాను అద్దెకు తీసుకునేవారి నుంచి వారు చెల్లించే బాడుగలో సగభాగం మినహాయింపు ఇవ్వగలిగితే కళాకారులకు కాసింత ఉపశమనం కలిగించినట్లవుతుంది. కార్పొరేషన్ అధికారులు ఆ దిశగా దృష్టి సారించి కళాకారులకు ఊతమివ్వాలని పలువురు కోరుతున్నారు.

నవధాన్యాల పద్ధతితో భూమికి పోషకాల లభ్యత

పులివెందుల రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానాలలో (పీఎండీఎస్) నవధాన్యాల పద్ధతి ద్వారా మొక్కల వేర్ల నుంచి భూమికి కావాల్సిన పోషకాలు అన్నీ లభిస్తాయని ఏవో చెన్నారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నవధాన్యాల పద్ధతి ద్వారా విత్తిన విధానాన్నిపరిశీలించారు. ప్రకృతివ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె..: పంటల సాగులో పెట్టుబడులు తగ్గించుకునే ప్రయత్నం చేయాలని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని అలిదెన గ్రామంలో బుధవారం మండలంలోని అలిదెన గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శివ, బాష, రైతులు పాల్గొన్నారు.

వల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎ.ఓబాయపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు సురేఖ పాల్గొన్నారు.


ఇ.కొత్తపల్లెలో నవధాన్యాలు విత్తిన విధానాన్ని పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి, పొలం పిలుస్తోందిలో పాల్గొన్న వ్యవసాయ సిబ్బంది

కమలాపురం రూరల్..: ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కలిగి పంటలు సాగు చేసుకోవాలని ఏవో సరస్వతి తెలిపారు. బుధవారం గొల్లపల్లె, జంభాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, మహేశ్, రైతులు పాల్గొన్నారు.

చక్రాయపేట..: రంసపీల్చేపురుగు రాకుండా నీమాస్త్రం పిచికారీ చేయాలని ఏవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చిలేకాంపల్లె ఆర్ఎస్‌కెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమణారెడ్డి, వీఏఏ ముబారక్,సురేఖ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వేముల..: తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక ఉత్పత్తులుసాధించాలంటే తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏవో ఓబులేసు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని నల్ల చెరువుపల్లె, కొండ్రెడ్డిపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలు అనుసరించి ఎరువులు, యాజమాన్యం పాటించాలని పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీఏఏ సుధ, ఎంపీటీసీ నరసంహారెడ్డి,రైతులు పాల్గొన్నారు.


10వ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పులివెందుల రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి పాఠశాల ప్రథమస్థానం సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి తెలిపారు. తొండూరు మండలంలోని అగడూరు గ్రామం జడ్పీ హైస్కూల్‌లో మొదటిస్థానం సాధించిన గంగాశ్రీవిద్యకురూ.3000, రెండోస్థానం పొందిన విష్ణుచరితకు రూ.2000 నగదును సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, అలవలపాటి రఘురామిరెడ్డి ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో మేకల చంద్రశేఖర్‌రెడ్డి, ఇమామ్‌సాహెబ్, పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

వేంపల్లె,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని శ్రీరామ్‌నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వెంటనే చర్యలు తీసుకుంటామని ఈఓ మాధవరెడ్డి తెలిపారు. కొద్దిరోజులుగా నీళ్ల సక్రమంగా రావడం లేదని శ్రీరామ్‌నగర్ వాసులు పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఈఓకు సమస్యను విన్నవించారు. విషయాన్నిసర్పంచు ఆర్.శ్రీనుదృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ సిబ్బందితో కలిసి ఈఓ శ్రీరామ్‌నగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. నీటి సరఫరమోటార్‌ను పరిశీలించారు. పైప్‌లైన్‌కు మరమ్మతు చేసి నీళ్ల సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఈఓ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



వేముల,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వేములకు చెందిన మౌనిక అనే 13ఏళ్ల బాలికకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును బుధవారం పంపిణీ చేశారు. వేముల టీడీపీ నాయకులు ఓబుళ రెడ్డియాదవ్, వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డిల చేతులమీదుగా రూ.71వేలు చెక్కును మౌనిక తల్లికి అందించారు.

తల్లికి వందనం పెద్ద స్కామ్ : వైసీపీ

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం అతిపెద్ద స్కాం అని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరంలోని అంజాద్‌బాష క్యాంప్ కార్యాలయంలో వైసీపీ రూపొందించిన 'జగన్ అంటే నమ్మకం బాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని, వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు.

రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' అందజేయాలి

కడప సెవెన్ రోడ్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టా, డీకేటీ , కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ రెండేళ్ల ప్రభుత్వ సాగు సహాయాన్ని అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గాలి చంద్ర కోరారు. బుధవారం స్థానిక ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ నిధులను అందజేయాలని జూన్ 23న కలెక్టరేట్ వద్ద ఏపీరైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టామన్నారు. డీకేటీ, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, జిల్లాసమితిసభ్యులు బి.రామాంజ నేయులురెడ్డి, భద్రయ్య, నాయకులు పక్కీరప్ప,ఎన్.జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గాలిచంద్ర

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

పులివెందుల రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగా ఆవశ్యకత అందరికీ తెలియజేయాలనేదే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రాముడు, ఎంఈవో చంద్రశేఖర్‌రావు సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ హాలులో పులివెందుల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయన్నారు. 21న జరిగే కార్యక్రమానికి పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులు పాల్గొనేలా చొరవ చూపాలని కోరారు. అన్ని పాఠశాలలు యోగాంధ్రలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అనంతరం యోగా కార్యక్రమానికి డ్రస్‌కోడ్, సమయం తదితర విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం..: యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి మండల అధికారులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాక్టీస్ ఇచ్చి 21 ఉదయం 7 గంటలకు యోగా నిర్వహించాలన్నారు .కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటరాముడు, ఏఓ కళ్యాణ్‌కుమార్, ఎంఈఓ1 ఓబు లేసు, ఎంఈఓ2 శారద, ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.


పులివెందుల.. మాట్లాడుతున్న కమిషనర్ రాముడు

లింగాల..: అధికారులందరు సమన్వయంతో పనిచేసి యోగాంధ్ర కార్యక్రమాన్ని వజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. లింగాల మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం యోగ కార్యక్రమంపై అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన అన్ని గ్రామసచివాలయాలలో ప్రజలతో కలిసి యోగ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు.ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నరేంద్ర,ఏఓ లోకేష్, అధికారులు పాల్గొన్నారు.

చెన్నూరు..: యోగాంధ్ర కార్య క్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, డిప్యూటీ తహసీల్దారు వెంకటరమణ, వైద్యాధికారి చెన్నారెడ్డి, ఏపీవో శైలజ, ఏపీయం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీకేదిన్నె..: ఈనెల 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి చాంద్‌బాష తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల అధికారితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుళాయిబాబు, ఈవోఆర్డీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలగనూరు రిజర్వాయర్ గురించి ముఖ్యమంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే పుట్టా



అలగనూరుకు నిధులిచ్చి కేసీ రైతులను ఆదుకోవాలి

● ముఖ్యమంత్రికి వివరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అలగనూరు రిజర్వాయర్‌లో ఆనకట్ట పనులు పూర్తి అయితే కడప జిల్లా కేసీ రైతుల పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి వివరించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి కేసీ రైతులను ఆదుకోవాలని కోరారు. అలగనూరు రిజర్వాయర్ పూర్తి అయితే సుమారు లక్ష ఎకరాలకు నీరందుతుందని, రైతులు రెండు కార్ల పంటలను పండించుకోవచ్చునని తెలిపారు. దీనిపై సీఎం స్పందించి రైతుల విషయంలో నిర్లక్ష్యం తగదని, త్వరితగతిన అలగనూరు ఆనకట్ట మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు పుట్టా తెలిపారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి : ఎంపీడీవో

ఎర్రగుంట్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. ఉపమండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై జడ్పీటీసీ బాలయ్య, ఇతర ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని శాఖల అధికారులు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రంతుల్లయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'యోగాంధ్ర'ను విజయవంతం చేయాలి : ఆర్డీవో

బద్వేలు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో చంద్రమోహన్, బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న నిర్వహించే యోగా కార్యక్రమంపై నియోజకవర్గస్థాయి అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21న బద్వేలు పట్టణంలోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి నుండి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసంస్థలు భాగస్వామ్యం అయ్యేలా ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలన్నారు. పోలీసు అధికారులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులతో పాటు సిబ్బంది కూడా యోగాలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, బద్వేలు అర్బన్ రూరల్ సీఐలు రాజగోపాల్, నాగభూషణం, మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి, ఎస్‌ఐలు సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న బ్రహ్మంగారిమఠం కస్తూరిబా పాఠశాల విద్యార్థినులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బ్రహ్మంగారిమఠం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా ట్రైనర్ పత్తి సురేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినిలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. పిల్లల నుండి పెద్దలు, వృద్ధులు అందరూ కూడా యోగా శిక్షణ పొంది సంపూర్ణ ఆరోగ్యం పొందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

గ్రామస్థాయిలో యోగా నిర్వహించాలి

చాపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న అన్ని గ్రామ పంచాయతీల్లో యోగా నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం యోగాపై అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఎంపీడీవో వీరకిశోర్, తహసీల్దారు రమాకుమారి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో ప్రజలను కలుపుకుని యోగా నిర్వహించాలన్నారు. సమావేశంలో గ్రామ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్, టీడీపీ కళ్యాణ మండపం, నామా ఎరుకలయ్య ఆశ్రమంలో యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, పట్టణ ప్రజలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీనివాసులు, ఏసీపీ నాగరాజు, యోగా గురువులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనుల పరిశీలన

పోరుమామిళ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సిమెంటు రోడ్డు పనులను ఆర్‌అండ్‌బీ డీఈ సలీం, ఏఈ రజియా పరిశీలించారు. పోరుమామిళ్లలో రూ.25కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయిబాబా దేవాలయానికి ఎదురుగా వేస్తున్న సిమెంటు రోడ్డు పనులను వారు పరిశీలించారు. పనులు నాణ్యతగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

బద్వేలుటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీవీఆర్ కళాశాలలో ఈనెల 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి విజయ్ వినిల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎస్‌బీవీఆర్ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలలో 10 అత్యున్నత స్థాయి కంపెనీలు పాల్గొంటాయని, టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి ఇది సువర్ణావకాశమని సూచించారు. డివిజన్ పరిధి లోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7893574673, 9704940639 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఎఫ్‌బీవో కుటుంబానికి ఆర్థిక సాయం

బద్వేలుటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బద్వేలు రేంజ్ పరిధిలో ఎఫ్‌బీవోగా పనిచేసిన శ్యాంసుందర్ అకాల మృతి చెందడంతో ఆ కుటుంబానికి రాష్ట్రంలోని ఫారెస్ట్ అధికారుల కుటుంబసభ్యులు ఇచ్చిన రూ.1,33,000 ఆర్థిక సాయాన్ని బుధవారం కడపలో డీఎఫ్‌వో వినీత్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. శ్యాంసుందర్ కుటుంబానికి డిపార్ట్‌మెంట్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆదినారాయణమ్మ, ప్రొద్దుటూరు ఫారెస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కరుణాకర్, సెక్రటరీ రమణ, సుంకయ్య పాల్గొన్నారు.

నేడు మండల మీట్

కలసపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక సభాభవనంలో జరుగుతుందని ఎంపీడీవో మహబూబ్ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి హామీ, అభివృద్ధి పనులతో పాటు అన్ని శాఖల పనులపై సమీక్షించడం జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

గృహాలకు అక్రమ విద్యుత్ కనెక్షన్ల తొలగింపు



బ్రహ్మంగారిమఠం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండా శింగరాయస్వామి భూముల్లో కొందరు అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారు. వీరికి దేవదాయశాఖ అధికారులు అనేకమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ పట్టించుకోలేదని ఈవో బీవీ నరసయ్య పేర్కొన్నారు. 2019లో కొండా శింగరాయస్వామి భూముల్లో అనుమతులు లేకుండా ఇళ్లను నిర్మించుకున్నారని... వారికి నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించలేదన్నారు. దీనిపై సర్వే నెం.320లో 70 మందిపై కోర్టును ఆశ్రయించగా సోమవారం ఎండోమెంటు ట్రిబ్యునల్‌లో పది మందిపై కేసు గెలవడంతో వారు నివశిస్తున్న ఇళ్లకు బుధ వారం విద్యుత్ కనెక్షన్లు తొలగించామని ఈవో తెలిపారు.

జీవాల పెంపకంతో ఉపాధి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులు జీవాలను పెంచడం ద్వారా ఉపాధి లభించడమే కాక ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ పీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. బుధవారం పశువైద్య కళాశాలలో పశుపోషణ విభాగం, హైదరాబాదుకు చెందిన జాతీయ మాంసం పరిశోధన సంస్థ సహకారంతో జీవాల పశుపోషణలో మెలకువలు, ఖనిజ లవణాల ప్రాముఖ్యతపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టేలు పిల్లలను పెంచడం వలన రైతులు సంవత్సరం పొడవునా ఆదాయం పొందవచ్చునని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం వలన పెట్టుబడి వ్యయం తగ్గుతుందని,శాస్త్రీయ పద్ధతులను పాటించడం వలన నాణ్యమైన జీవాలను పెంచవచ్చునని తెలిపారు. అనంతరం పశుపోషణ విభాగం అధిపతి డాక్టర్ రమణారెడ్డి, పశువైద్యులు రాధాకిశోర్, ఇందిర, త్రివేణి, జ్ఞానచరిత, విజయకుమార్ రైతులకు జీవాల పెంపకంలోని మెలకువలు, వసతి, పోషణ, ఆదాయ వ్యయాలు, పశుపోషణకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, పశువుల వ్యాధులు, చికిత్సలపై వివరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు, బీమగుండం, కొర్రపాడు, పోట్లదుర్తి, టంగుటూరు, పెద్దముడియం, కమలాపురం ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిబంధనలు పాటించని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఏబీవీపీ నాయకులు ఎంఈవో సావిత్రమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి శివనారాయణ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అలాగే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఇతర విద్యాసామగ్రిని పాఠశాలలోనే విక్రయిస్తున్నారని, వారివద్దనే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో అధిక ఫీజులు, పుస్తక విక్రయాలపై చర్యలు తీసుకోవడంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖాధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాష కోరారు. కడపలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఏయే పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారో తెలుపాలని విద్యాశాఖాధికారులు కోరడం దారుణమన్నారు. ప్రతి మండలంలోనూ ఇద్దరు ఎంఈవోలు, సీఆర్‌పీలు ఉన్నారని, ఏ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారో వారికి తెలుసునన్నారు. అధిక ఫీజులపై చర్యలు తీసుకోకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ముళ్ల పొదల తొలగింపు

ముద్దనూరు జూన్18(ఆంధ్రజ్యోతి):స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద ముళ్ల పొదల తొలగింపును బుధవారం అధికారులు చేపట్టారు. ఈ నెల 15వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ముళ్లపొదల నడుమ ఎంపీడీవో కార్యాలయం అన్న శీర్షిక ప్రచురించడం జరిగింది. దీంతో అధికారులు స్పందించారు. డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, ఈవో నరసింహులు జేసీబీ యంత్రం సహాయంతో ముళ్ల పొదల తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముద్దనూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కోనాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రకృతి వ్యవసాయం విభాగం మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఘన, ద్రవ జీవామృతం ఎరువుల తయారీ, వాడకంపై వివరించారు. కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సొంత మండలాల్లోనే బదిలీ చేయాలి

ప్రొద్దుటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులను ఇతర మండలాలకు బదిలీ చేయవద్దని సొంత మండలాల్లోనే సచివాలయాలకు మార్చాలని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మస్తాన్, కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సచివాలయ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు నాలుగవ తరగతి ఉద్యోగుల కిందకి వస్తారని, జీవో నెంబరు 5 సవరణ చేసి మండలం పరిధిలోనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సచివాలయ ఉద్యోగుల పదోన్నతుల్లో ప్రభుత్వం చొరవ చూపకుండా ఇలా రోజుకొక జీవోతో సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కాశినాయన, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. కమ్మవారిపల్లెకు చెందిన పసుపులేటి వెంకటమ్మ సేవా సంస్థ నిర్వాహకుడు జీవీ రమణ, పాఠశాల పూర్వ విద్యార్థి రాజుపాలెం బాదుల్లా సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించి, వారి తల్లిదండ్రుల చేతులమీదుగా అందజేశామన్నారు.

ఐసీఎల్ సమస్య పరిష్కారం

● నేటి నుంచి విధుల్లోకి..

ఎర్రగుంట్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఐసీఎల్ కర్మాగారం వద్ద ప్యాకింగ్ ప్లాంటు కార్మికులు చేస్తున్న ఆందోళన బుధవారం పరిష్కారమైంది. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సమక్షంలో ఐసీఎల్ యాజమాన్య ప్రతినిధులు, ఎన్‌డీఏ కూటమి ఎర్రగుంట్ల మండల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, కార్మిక నాయకులు చర్చలు జరిపారు. సమస్యలు పరిష్కరించేందుకు అంగీకారం కుదరడంతో ఆందోళన విరమించేందుకు కార్మికులు అంగీకరించారు. గురువారం నుంచి కార్మికులు విధులకు యధావిధిగా వెళ్లనున్నట్లు తెలిపారు. రెండు వారాలుగా ఐసీఎల్ యాజమాన్యం, కార్మికుల మధ్య ప్రతిష్టంభన నెలకొనడంతో కర్మాగారంలోకి ఎవరినీ పంపకుండా అడ్డుకున్నారు. దీంతో ఇక్కడ ఆందోళనకర వాతావరణం నెలకొంది. అయితే కలెక్టర్ జోక్యంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది.

డెమో రైలుకు అదనపు బోగీలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నుంచి రేణిగుంటకు వెళ్లే డెమో రైలుకు అదనపు బోగీలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని సీపీఐ పట్టణ ఏరియా కార్యదర్శి రాంప్రసాద్, సహాయ కార్యదర్శి సిరివెళ్ల లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు వారు బుధవారం రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుపతి సమీపానికి వెళుతున్నందున తిరుమలకు వెళ్లే భక్తులు అధిక సంఖ్యలో ఈ రైలులో వెళ్లడం జరుగుతుందని, దీంతో మహిళలు, చిన్నపిల్లలు చాలా ఇరుకుగా ప్రయాణం చేయాల్సి వస్తోందని తెలిపారు. ఉద్యోగులకు, వ్యాపారులకు ఈ డెమో రైలు అనుకూలంగా ఉండడం వలన ప్రయాణికులు ఎక్కువగా వెళుతున్నారని, వారి సౌకర్యార్థం సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే రైల్వేస్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సమితి నాయకులు ప్రసాద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మంచి దిగుబడులు

రాజుపాలెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మంచి దిగుబడులు సాధించవచ్చని మైదుకూరు డివిజను వ్యవసాయశాఖ ఏడీఏ క్రిష్ణమూర్తి సూచించారు. బుధవారం అర్కటవేముల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందాలని రైతులకు సూచించారు. సమగ్ర వ్యవసాయ పద్ధతులు, సూక్ష్మపోషణ ఏ సీజన్లలో ఏ రకమైన పంటలు వేయాలి, విత్తనశుద్ధి తదితర వాటి గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శివరామక్రిష్ణారెడ్డి, వ్యవసాయ సంచాలకులు సునీల్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

పోరుమామిళ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల శాతం పెంచాలని, వారికి కావాల్సిన మౌలిక వసతులను ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేస్తామని సర్వశిక్ష అభియాన్ ఏఎంవో విజయభాస్కర్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని టేకూరుపేట ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ 21న యోగా డే సందర్భంగా ప్రతి పాఠశాలలో యోగా నిర్వహించాలని, ఈ కార్యక్రమం ఒక్క రోజుతో కాకుండా ప్రతిరోజూ పాఠశాలలో జరిగే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయుడు బాలచంద్రయ్యకు సూచించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రవికుమార్, ఉపాధ్యాయులు కుర్ర చెన్నయ్య, విక్టర్‌బాబు, జగన్ మోహన్‌రెడ్డి, జయలక్ష్మి పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఖాజీపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండల పరిశీలకుడు కొలవలి వేణుగోపాల్ అన్నారు. బుధవారం టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకం అమలు కావడంతో వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైందని, దీంతో వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. స్కూళ్లు తెరచిన సమయంలో పథకం అమలు చేయడంతో పిల్లల చదువు ఖర్చులకు ఉపయోగపడుతోందని వివరించారు. గత అయిదు సంవత్సరాల పాలనలో వైసీపీ ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. కార్యక్రమంలో గోవిందు సుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు గురువారం నుండి ఎస్ఎస్‌సీ, సీజీఎల్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీతలు తెలిపారు. బుధవారం జేవీవీ కార్యాలయంలో ఉచిత శిక్షణ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ, సీజీఎల్‌లో 14582 పోస్టులకు నోటిఫికేషన్ వచ్చిందన్నారు. వీటితోపాటు ఏపీ హైకోర్టులో 1621 పోస్టులు, బ్యాంక్ ఆఫ్ బరోడాలో 500, ఆర్‌అండ్‌బీ గ్రూప్-డిలో 438, ఏఎల్‌పీలో 11,558 పోస్టులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యేవారు జేవీవీ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు రవిబాబు, నరేష్, దేవానంద, గాయత్రి, మౌనిక, హరికేశవ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే మహా పాదయాత్ర విజయవంతం

బద్వేలు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి భక్తులు, ప్రజలు, శ్రేయోభిలాషుల సహకారంతోనే వల్లెరవారిపల్లె నుంచి పెంచలకోన క్షేత్రం వరకు చేసిన మహాపాదయాత్ర విజయవంతమైందని ఆలయ పూజారి, దీక్షాపరుడు పెంచలయ్యస్వామి తెలిపారు. బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక కల్యాణం కోసం వల్లెరవారిపల్లె లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి ఆదివారం ఉదయం పెంచలకోన పాదయాత్ర చేయడం జరిగిందన్నారు. ఇటీవల కరోనా మహమ్మారి, యుద్ధ వాతావరణం లాంటి ఎన్నో అవరోధాలు ఏర్పడుతున్నాయని దీక్షాపరులతో కలిసి పెంచలకోన వరకు పాదయాత్ర చేసి అన్ని పరిస్థితులు చక్కబడి ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించామన్నారు. దారి పొడవునా స్వామివారి భక్తులు అందించిన సహకారంతోనే పాదయాత్ర పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్వామివారి భక్తులు దర్శి సుబ్బరాజ, ఎర్రంరెడ్డి ఆవుల శేఖర్‌రాయల్, పత్తి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెంచలయ్యస్వామి